# పాపం! సింహాచలం!!

- దానం శివప్రసాదరావు

**సింహాచలానికి ఈ మధ్య ఓ చిక్కు సమస్య వచ్చి పడింది. తనతోటి వాళ్ళు, ఇంటి పక్కవాళ్ళూ తనకు ఓ పెద్ద సవాలై పోయారు. రెండ్రోజుల నుంచి తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఏం చేస్తే బావుంటుందని. ఎలా వెరైటీగా ఎదగాలని.**

**ఏదోకరకంగా తన మిత్రులు, బంధుగణం, చివరకు ఇంటి పక్కన ఆచారి సమాజంలో 'ఫోకస్' అవుతున్నారు.**

తను ఏకాడికీ ఆఫీసు పని గంటలు. తప్పితే ఇంట్లో టీ.వీ. ప్రోగ్రాములు మినహా మరే ఇతర వ్యాపకమూ లేదు.

"మణిసన్నాక కాసింత కళాపోషణ ఉండొద్దూ" అన్న మాటలు పదే పదే స్మరించు కుంటున్నాడు.

బొద్దుగా ఉండే సింహాచలం నవ్వుతూ, నవ్విస్తూ ఉండే మనిషి. నుదుట చెరగని సింధూరపు బొట్టు, చిరుబొజ్జ. చిరుబొజ్జని కాదులెండి! కాస్తంత ముందుకు పొడుచుకుని బాగానే కానొస్తుంది. మాటల పుంజు. అందరికీ అన్నీ జాగ్రత్తలు, హెచ్చరికలు అలవాటుగా ఇస్తుంటాడు. కానీ అవేవీ తనకు గాదు అన్నట్టుగా ఉంటాడు. అందరికీ అంటే- కార్యాలయంలో తనతోటి వారందరికీ కాఫీలు, టీలు పదే పదే తెప్పిస్తుంటారు. ఒకరకంగా ఖర్చుకి వెనకాడే మనిషి కాదు. పైగా భోళాతనం.

ఒక్కరోజు అతను కార్యాలయానికి రాకుంటే ఆ రోజు అందరూ ఏదో పోగొట్టుకున్నట్టుగా ఫీలవుతారు.

. "ఇదుగో... వేళకు కార్యాలయానికి రాకపోతే ఎలా? క్రమశిక్షణ చాలా ముఖ్యం" అంటూ తోటి వారిని హెచ్చరిస్తుంటాను. తను మాత్రం 'లేటు'గా వస్తుంటాడు. బాస్ చేత అక్షింతలు వేయించుకోవడం రివాజు.

"ఏమయ్యా! ప్రతిరోజూ చెప్పాల్నా" అంటూ బాస్ కేకలేస్తే. దండం పెడుతూ... తలాడిస్తూ "రేపట్నించి సకాలంలో వస్తాను. తమదయ!" అంటూ తలొంచుకుని తన సెక్షన్‌లోకి వస్తూ చిలక నవ్వు నవ్వుతారు.

"ఏం! సింహాచలం మాకు చెప్పి నువ్వు లేటు గా వచ్చావేమిటి?" అని తోటి వారు అడిగితే-

"ఎక్కడండి! మాయ సంసారంలో ఎన్ని బాధలు!" అంటాడు. వస పిట్టలా మాటలు ధారాపాతంగా పోతుంటాయి. ముక్కు మూసుకొని తమ పని తాము చేసుకొనే వారిని సైతం మాటల్లోకి దించేస్తాడు. అన్ని విషయాలు అతనివే. అందరి మాటలూ తనవే. ఇంతకూ సింహాచలానికి వచ్చిన చిక్కు సమస్య? తనుంటున్న పక్క పోర్షన్లో ఆచారి పంతులుగారు. కాసింత సాహిత్య పిపాసి. కవి తెలుగు పండితుడు గవర్నమెంటు స్కూల్లో. తన ఈడువాడే. మాటకారి. మాటలు కోటలు దాటతాయ్.


పట్టణంలో ఏ చిన్న సాహిత్య కార్యక్రమం, సంగీత కార్యక్రమం, సేవా కార్యక్రమాలు జరిగినా పిలుస్తూ ఉంటారు. వక్తగా.

మరుసటిదినం దినపత్రికల్లో రాగానే- నల్గురికీ చూపించి మురిసిపోతాడు. ఒక పట్టాన వదలడు. నాటి సభా కార్యక్రమంలో తన వంతు పాత్రకు మెరుగులద్ది మరీ విన్పిస్తాడు. ఇంతకూ వచ్చిందేమిటంటే-

తను పేపరు తెప్పించుకోడు. ప్రొద్దున్నే బ్రష్ చేసుకుంటూ "సింహాచలంగారూ.... పేపరొచ్చిందా?" అనంటూ, 'తన సభాప్రాభవం' చూపుతూ ఇహ లెక్చరిస్తాడు.

పాపం సింహాచలం బిక్క మొహం వేసుకుని, తలాడిస్తూ వినడం మధ్య మధ్యలో ఇకిలించడం మినహా ఏమీ చెయ్యలేడు. ఓ వైపు తన, దిన కృత్యాలకు, టైం అవుతున్నా పోలేనిస్థితి.

పైగా ఆచారి పంతులుగారు ఓ సలహా ఇస్తాడు.



చూడండి సింహాచలంగారూ... మనలో ఉన్న 'టాలెంట్'ను దాచుకోకూడదు. దాన్ని వెలుగులోకి తేవాలి. 'తిని తొంగుంటే మనకీ గొడ్డుకు తేడా ఏముంటుందీ" అన్న ముత్యాల ముగ్గు రావుగోపాలరావు డైలాగ్ పరోక్షంగా అన్నట్టుగా అంటాడు.

ఇంట్లో "గృహలక్ష్మి" కూడా ఆచారి పంతులుగారు చెప్పిందానికి వంత పాడటమూ కద్దు.

నిన్నగాక మొన్న 'రోహిణి' ఎంత పాపులర్ అయిందీ!

రోహిణి తన సహ ఉద్యోగి. అదేదో పోటీ కథల్లో ప్రథమ బహుమతి ఐదువేల రూపాయలు గెల్చుకుంది. మొన్న సాయంత్రం 'పార్టీ' ఇచ్చింది. పైగా ఓ చిన్నపాటి అభినందన సభ. సింహాచలమే సభా కార్యక్రమాన్ని నిర్వహించాడు.

రోహిణి పేరు ఇంతింత అక్షరాలతో. అందరూ ఆ కథను చదివి అభినందించారు.

ఆ మాటే ఇంటి దగ్గర గృహలక్ష్మితో అంటే– "మీరు కూడా అలాంటి కథలు రాయకూడదూ..." దీర్ఘం చేసింది.

"పొద్దస్తమానం ఆ టీ.వీ. చూడకపోతే" ఓ చురకంటించింది.

"నేనేం కథలు రాయనే! మా నాయనమ్మ చిన్నప్పుడు చెప్పిన "అనగనగా ఓ రాజు. ఆయనకేడుగురు కొడుకులు" ఉన్నదున్నట్టు రాయగలను! అది మినహా నేను రాయలేను" తెగేసినట్టుగా చెప్పేసి సంబరపడిపోయాడు.

ఇంతలో సింహాచలం ఏకైక పుత్రరత్నం 'గస' పెడుతూ పరుగెట్టుకొచ్చాడు. "డాడీ... డాడీ... ఓ యాభై రూపాయలివ్వు" అన్నాడు.

"దేనికిరా నీకు యాభై" గుడ్లురిమాడు సింహాచలం.

"మా టీచర్‌కు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డొచ్చింది. సన్మానం అందుకని!"

"ఆ సన్మానమేదో వాళ్ళు చేస్తారుగా!"

"మళ్ళీ మేం చేస్తున్నాం డాడీ... ఇవ్వు"

"కష్టపడి టాలెంట్ చూపినవాళ్ళకు సన్మానాలూ– గట్రా ఉంటాయి. ఇవ్వండి. ఇచ్చి పంపండి!" ఆర్డరేసింది గృహలక్ష్మి.

"మీకు అలాంటి అవార్డులు–సన్మానాలు ఉండవా!" అంది పైగా ఇబ్బందిగా మొహం పెట్టాడు సింహాచలం.

నిన్నటికి నిన్న జరిగింది అశనిపాతం. ఎంత మర్చిపోదామన్నా మర్చిపోలేకున్నాడు. నిన్న ఉదయం టెలిఫోన్ రింగవడంతో మేల్కొన్నాడు. బావమరిది నుంచి ఫోను వైజాగ్ నుంచి. ఏదో చర్చావేదికలో పాల్గొన్నాట్ట! ఈ రోజు సాయంత్రం 7 గంటలకు 'రిలే'. టెలీకాస్ట్ చేస్తార్ట. తప్పనిసరిగా చూచి తరించమని. వాళ్ళక్కను పిలిపించుకొని మరీ శుభవార్త చెప్పాడు. ఆ సాయంత్రం తను ఇంటికొచ్చే సరికి ఆ వీధిలో ఉండే అమ్మలక్కలనందర్నీ పిల్చి మరీ టీ.వీ. ముందు కూర్చోబెట్టింది. మా తమ్ముడి ప్రోగ్రాం వస్తోందంటూ.

అసలే మూడు గదుల చిన్న కొంప. ఆపై ఇంటి నిండా జనం. పైగా అదేమన్నా సినిమానా? వినోద కార్యక్రమమా? అంతగా అందరూ చూడాలనుకుంటే– ఫోన్లు చేసి చెప్పొచ్చుగా! వచ్చిన వారందరికీ టీలు, కాఫీలు... బిస్కెట్లు... ఓ చిన్న సైజు పార్టీలా. ఉడుక్కున్నాడు సింహాచలం.

ఆ రాత్రి– "మా తమ్ముడు ఎంత బాగా మాట్లాడాడో! వెధవ! చిన్నప్పుడు నోరు మెదిపేవాడు కాదు. ఎవరైనా క్రొత్తవారు మాట్లాడిస్తే మొన్న మొన్నటి వరకు తలెత్తి చూసి మాట్లాడేవాడు కాదు! ఎన్ని తెలివితేటలు వచ్చాయ్! అచ్చు మా నాన్నగారిలాగే!" బుగ్గలు నొక్కుకుంటూ అంది గృహలక్ష్మి.

"టీ.వీలో ఎంత చక్కగా ఉన్నాడు. అవునూ రాష్ట్రంలో అందరూ చూస్తారు గదండీ!" కొంచెం దీర్ఘం తీస్తూ.

రాష్ట్రం ఏం ఖర్మ! మీవాడి రూపలావణ్యాలు, గొప్పదనం ప్రపంచమే చూస్తుంది" నాలుక దాకా వచ్చింది. తమాయించుకున్నాడు.

"మా తమ్ముణ్ణి అడక్కూడదూ...మీకు కూడా టీ.వీ. ఛాన్స్ దేన్లో ఐనా వస్తుందేమో" ఓ సలహా విసిరింది.

"సునామీ" పోటులా తోచింది సింహాచలానికి. విలవిల్లాడిపోయాడు. ఓ కఠోర నిర్ణయం ఉత్తర రక్షణంలోనే తీసుకున్నాడు. మరి తిరుగు లేదు తన నిర్ణయానికి. నిశ్చయించుకున్నాడు. రేపట్నుంచే అమలు.

తనకు కథలు రాయటం, కవితల్లల్లటం, సంగీతం, చిత్రలేఖనం గట్రా కళల్లో ప్రవేశం ఏమాత్రం లేదు.

## పుస్తకాలు


### రతనాల జాబిలి

రచన : డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి

పేజీలు : 88

వెల : రూ. 35/-

**ప్రతులకు : డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి, డోర్.నెం. 10/481, స్టేషన్ రోడ్, నారాయణపురం, నడికుడి శివారు, దాచేపల్లి (పోస్టు), గుంటూరు జిల్లా. పిన్ 522 414. ఫోన్: 08649- 246018.**




నేడు పెరిగిపోయిన టి.వి. ఛానళ్ళ వలన రేడియో వినేవారు కరువయ్యారంటే అతిశయోక్తి లేదు. ఒకప్పుడు రేడియోలో కూడా జనరంజకమైన అనేక కార్యక్రమాలు ప్రసారమయ్యేవి. నాడు రేడియోల్లో ప్రసారమైన గీతాలకు అక్షర రూపం కల్పించారు ప్రముఖ రచయిత డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి. మొత్తం 80 కు పైగా గీతాలను వీరు సేకరించి ఒక సంకలనంగా ముద్రించారు. కొన్ని గీతాల అడుగుభాగాన గాయకుడు, సంగీత దర్శకుడు, ప్రసారం చేసిన రేడియో కేంద్రం, ప్రసారం చేసిన తేదీ కూడా ప్రచురించారు. ద్వారం వెంకటస్వామి నాయుడు మనుమరాలు ద్వారం లక్ష్మి ఆలపించిన గేయాలు, ఉపద్రష్ట కృష్ణమూర్తి, టి.ఆర్. జయదేవ్, మాధవపెద్ది, పోలూరి నరసింహారావు ఇత్యాదివారు సంగీతాన్ని సమకూర్చిన గేయాలున్నాయి. వీటి సంకలన కర్త డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి 'శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితం – రచనలు' అనే అంశంపై తెలుగులో పి.హెచ్.డి. చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం ఎస్.వి.కె.పి. కళాశాల ప్రిన్సిపాల్‌గా చేసి పదవీ విరమణ చేశారు. గతంలో 40 పుస్తకాలు రచించిన వీరు తన అనుభవాన్ని రంగరించి 'రతనాల జాబిలి'ని రూపకల్పన గావించారు.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**



❊ ❊ ❊

ఏదోక రంగంలో తను గుర్తింప బడాలి. ఇమ్మీడియెట్‌గా తను, తను వాళ్ళల్లో గుర్తింపబడాలి... ఎలా?... ఎలా?... ఎలా?... ఆలోచనల్లో పడ్డాడు సింహాచలం.

మోపెడ్ కార్యాలయం ముందు ఆపాడు డ్యూటీకి రోజూవారి హాజరులో భాగంగా. అల్లంత దూరాన... మెయిన్ రోడ్ ప్రక్కనే పేవ్ మెంట్‌పైన దిరిశెన చెట్టుకు ఇవతలగా క్లియర్‌గా కానొస్తోంది ఆ దృశ్యం.

నాలుగడుగులు అటువైపుకేశాడు. ఓ అరవై ఏళ్ళ ముసల్ది. అస్థి పంజరంపై చర్మం కప్పినట్టుగా ఉంది. అటువైపు తిరిగి పడు కొనుంది మునగదీసుకుని. పాత మసిగుడ్డ లాంటి చివికిన గుడ్డ దేహంపై గాలికి రెపరెప లాడ్తోంది. చుట్టూరా అక్కడక్కడ చిల్లరపైసలు. కరిగి నీరైపోయాడు సింహాచలం. ప్రక్కనే ఓ చిన్న టీ బంకు.

కరిగి నీరైపోయి తిరిగి గడ్డ కట్టింది సింహా చలం మనస్సు. సడన్‌ఫ్లాష్... మస్తిష్కంలో మెరిసింది. ఈ అవకాశాన్ని జారవిడుచుకో కూడదు. ఈ దెబ్బతో సింహాచలం పేరు ఈ చిన్న పట్టణంలో మార్మోగిపోవాలి.

"అనాధ్ నాధ్... సింహాచలం! అనాధ బంధు సింహాచలం" ఆడిటోరియంలో తనకు ఫలానా స్వచ్ఛంద సేవాసంస్థలవారు సన్మానం చేయబోయే నేపథ్యంలో మిన్నంటే కరతాళ ధ్వనులు, టీ చప్పరిస్తున్న సింహాచలం చెవుల్లో మార్మోగాయి. 'ఎదుర్రొమ్ము' విశాల మైంది. (ఛాతీ)

పక్క పోర్షన్ ఆచారి పంతులు మస్తిష్కంలో మెదిలాడు. చూడు! ఈ సింహాచలం దెబ్బ! పేపర్లో నా పేరు, ఫోటోలు చూడు! చూడిక! చూచి చూచి కుళ్ళుకో! కసిగా అనుకున్నాడు మనసులో సింహాచలం.

"ఈ అవకాశాన్ని జారవిడుచు కోను!" కఠినంగా, ఖచ్చితంగా నిర్ణ యం చేసుకున్నాడు.

వడివడిగా కార్యాలయంలోకి అడుగేశాడు. తన నిర్ణయాన్ని సహ ఉద్యోగులకు చెప్పాడు. ఓ చిన్న సైజు లెక్చెరిచ్చాడు. విస్తుపోయి చూశారు అందరూ.

"చూడు సింహాచలం! ఎంతోమంది ఉన్నారు లోకంలో. మనమేం చెయ్యగలం! ఏదో తోచిన సాయం చెయ్యడం తప్ప!" అన్నారు ముక్త కంఠంతో.

అదే! ఆ సాయమే నేను చెయ్యబోతున్నారు. ఎవరికి వారు అలా అనుకుంటే మానవత్వం ఏముంటుంది? ఓ రూపాయి నాణెం విసిరి నంత మాత్రాన ఏముంటుంది?

ఆరోజు సింహాచలం 'సీరియస్‌నెస్'ను అందరూ విస్మయంగా చూశారు. అరపూట క్యాజువల్ శలవు పడేసి కార్యోన్ముఖు డైయ్యాడు. బైటకు వచ్చాడు. పేవ్‌మెంట్ మీద పడుకొని ఉన్న ముసలి యాచకురాలి దగ్గరకు వచ్చాడు.

"అవ్వా.... అవ్వా" అని పిల్చాడు. సన్నగా మూల్గింది.

"ఫర్వాలేదు... బ్రతికే ఉంది" అనుకొని అటుగా వెళ్ళే రిక్షాను కేకేశాడు. నేను 'బండి' మీద వస్తాను. ఈమెను గవర్నమెంటు హాస్పిటల్‌కు తీస్కెళ్ళు!" హుకుం జారీ చేసినట్టుగా అన్నాడు.

"పాతిక రూపాయలు" అన్నాడు రిక్షా అతను.

"అదేమిటి? ఇక్కడేగా... పది రూపాయలే కదా".

"ఇంకోళ్ళను చూసుకోండి".

"సరే! పద".

"పడుకోబెట్టండి" అన్నాడు రిక్షా అబ్బాయ్.

తెగించినట్టుగా అడుగేసాడు సింహాచలం. రెండు చేతుల్తో 'ముసిల్దాన్ని' ఎత్తి రిక్షాలో కూర్చోబెట్టాడు. కాదు పడుకోపెట్టాడు. టీకొట్టు వాళ్ళు, ఆ రోడ్డెంట పోయేవాళ్ళు సింహా చలంకేసి చూస్తున్నారు.

వాళ్ళేదో అనుమానంగా చూస్తున్న ట్టుగా ఫీలయ్యాడు సింహాచలం. అయినా ఓ ప్రక్క హృదయం పొంగుతోంది. ఇటు ఓ మనిషికి సాయం చేసినట్టుగా ఉంటుంది. మరో వైపు తనను రేపు అందరూ పొగుడు తారు. ప్రెస్ కవరేజ్ కూడా వచ్చేలా చూసు కోవాలి.

ముసిల్దాని తాలూకూ చింపిరిగుడ్డలో ఆ చోటనే పడి ఉన్న రూపాయి నాణేలన్నీ మూటగా కట్టాడు.

ఓసారి అటూ ఇటూ చూసి తనను అందరు చూస్తున్నారని నిర్ధారించుకున్నాక మోపెడ్ మీద బైల్దేరాడు.

జనరల్ వార్డులో చేర్చాడు. హాస్పిటల్ రిజిష్టర్లో తనే సంతకం పెట్టాడు. అదో ముప్పై పడకల ఆస్పత్రి.

వార్డు నర్సుకు జాగ్రత్తలు చెప్పి కాసిన్ని అరటిపళ్ళు, రెండు ఆపిల్స్ కొని బెడ్ పక్కనే ఉంచాడు. ముసిల్ది మూల్గుతూనే ఉంది. పాపం ఎవ్వరో అనాథ!

ఆ సాయంత్రం తను చేసిన పని గృహ లక్ష్మికి చెప్పాడు. మెచ్చుకోలుకై ఎదురు చూశాడు.

"ఎవరికీ లేని 'జిల' మీకెందుకు! మీరే మన్నా మహాత్మాగాంధీనా? మదర్ థెరిసానా? ఓ 'వంద' రూపాయలు ఆముదం" దీవించింది గృహలక్ష్మి.

ఆముదం తాగిన వాడిలా ఫేస్ మారిపోయింది సింహాచలానికి. అయితే ప్రక్క పోర్షన్ పంతులుగారు మెచ్చుకున్నాడు.

ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు సింహా చలానికి.

## జూలైలో జ్యోతిక పెళ్ళి!

గుమ్మడిపండు లాంటి భామ జ్యోతిక జూలైలో పెళ్ళి చేసుకోబోతోందని చెన్నైలో ఒకటే పుకార్లు! తమిళ నటుడు శివకుమార్ కొడుకు సూర్య, జ్యోతికలు చాలాకాలం నుంచి ప్రేమించు కుంటున్నారు. కానీ వారి పెళ్ళికి మాత్రం శివకుమార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో పెళ్ళి పందిరి సిద్ధం కాలేదు. కానీ ఇప్పుడాయన కూడా కొడుకు నిర్ణ యంతో రాజీ పడడంతో జూలైలో పెళ్ళి బాజా మోగ నుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే '7/జి బృందా కాలనీ' హీరోయిన్ సోనియా అగర్వాల్, ఆ చిత్ర దర్శకుడు సెల్వరాఘవల పెళ్ళి బాజాకూడా మోగనుందట!

❋ ❋ ❋

మరుసటి ఉదయం ఆఫీసుకెళ్తూ ఓసారి ముసిల్దాన్ని చూచి రావాలనుకొని హాస్పిటల్‌లోని వార్డులోకి వెళ్ళాడు.

ఆశ్చర్యం! బెడ్డు ఖాళీగా ఉంది. "పాపం ముసిల్ది పోయిందా? పోయే ఉంటుంది. ఎక్కడి మనిషో... ఏమో! హు.... హు.... జీవితం దుర్భరప్రాయమే కదా! నా అన్న వాళ్ళు లేకుండా ఈ దిక్కులేని చావు రాసి పెట్టి ఉంది" కొద్దిగా దీలాపడిపోయాడు సింహాచలం.

అటుగా 'నర్సు' వచ్చింది.

"సిస్టర్... మార్చురీలో ఉంచారా?" అన్నాడు విచారంగా ముఖం పెట్టి.

"ఎవర్ని?" ఖండితంగా అన్నది. కాసింత వెటకారమూ ధ్వనించింది గొంతులో.

"అదే... నిన్న ఓ ముసలి మనిషిని ఇక్కడ చేర్చాను గదా... ఆమె!"

"ఓహ్... ఆమెనా? ఆమె మీకు ఏమౌతుంది?" అధికారిలా ప్రశ్న ధ్వనించింది. ఒక్కసారి తనను తాను క్రిందికి పైకి చూసుకున్నాడు.

"ఏమైంది సిస్టర్!" ఆతృతను అణచుకుంటూ అన్నాడు.

"ఏమైందా? సెలైన్ బాటల్ పెట్టగానే లేచింది. పళ్ళు తిన్నది. రాత్రికి రాత్రే చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయింది మహాతల్లి" అంది.

"డాక్టర్లు సిస్టర్‌ను తిట్టి ఉంటారు. అందుకేనేమో కోపం" అనుకున్నాడు సింహాచలం.

"అయినా... ఇదేనా శ్రద్ధ... ఇదేనా సేవా భావం... ఇదేనా డ్యూటీ చేసే పద్ధతి? రాత్రి డ్యూటీ వారు ఆ మాత్రం పేషెంట్లను కనిపెట్టుకుని ఉండవద్దా?" కోపం ప్రదర్శిస్తూ కేకలేద్దామనుకున్నాడు.

అంతలోనే నాలుక్కరుచుకున్నాడు. అసలు ఆమె ఎవరు? ఆమెకు నీకు బంధం ఏమిటి? ఎక్కణ్ణుంచి తెచ్చావు? నీకు తెలీకుండానే వెళ్ళిందా? మీ ఇద్దరి మధ్య గొడవలేమైనా ఉన్నాయా? బంధుత్వం లేందే ఎవరో దారిన పొయ్యే మనిషిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళతావా?" ఇటువంటి ప్రశ్నలు వస్తాయేమో అని మిన్నకున్నాడు. పైగా తను రిజిష్టర్లో సంతకం పెట్టాడు.

"డాక్టర్లకు తను డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందేమో!" భయం వేసింది సింహాచలానికి. గుండె కాస్తంత వేగం హెచ్చింది. మారు మాట్లాడకుండా బైటకి నడిచాడు. మోపెడ్ తీశాడు.

ఎటెళ్ళి ఉంటుంది ముసిల్ది? అయినా నిన్నటివరకు కూర్చోలేని మనిషి నడిచి రాత్రిపూట వెళ్ళిపోయిందా? నమ్మవచ్చునా?

నర్సులు డ్రామా ఆడుతున్నారా? అయినా వాళ్ళకు అంత అవసరం ఏముంది?

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది.

మోపెడ్ కార్యాలయానికేసి బైల్దేరింది. అల్లంత దూరంలో తన కార్యాలయం.

ఆశ్చర్యం! అయోమయం! ఆతృత!

ఆ రోడ్డు ఎంట్రెన్స్‌లో పేవ్‌మెంట్ మీద అదే ముసల్ది! ఆమే! ఆ ముసలి యాచకురాలే! అటు వైపుగా తిరిగి పడుకొని ఉంది.

మోపెడ్ రోడ్డు ప్రక్కనే ఆపాడు. స్టాండ్ వేశాడు.

"ముసలి మనిషి' దగ్గరకు వెళ్ళాడు. "అవ్వా... అవ్వా" అన్నాడు ఆత్రంగా సన్నగా మూల్గింది. కళ్ళు సరిగ్గా తెరవలేదు.


"ఏం! అవ్వా! హాస్పటల్ నుంచి ఎందుకొచ్చావ్? నిన్ను సరిగ్గా చూడలేదా వాళ్ళు! డబ్బులడిగారా! వెళ్ళిపొమ్మన్నారా?" ప్రశ్న మీద ప్రశ్న వేశాడు సింహాచలం.

ముసల్ది చిన్నగా కళ్ళు తెరిచింది.

"నాతో ఎందుకు పోయ్యా! రోజుకు యాభై కళ్ళ చూసేదాన్ని. నన్ను తీస్కెళ్ళి అక్కడేసావు. ఏమొస్తదక్కడ? పోయ్యా... పో... నీ పని నువ్వు చూసుకోపోయ్యా! నాతో ఎందుకు నీకు!" మళ్ళీ అటువైపు తిరిగి పడుకుంది. అదే చింపిరి గుడ్డ మీదకు లాక్కుంది.

నివ్వెరపోయాడు. నిర్వీణ్ణుడయ్యాడు సింహాచలం. పాపం ఏదో ఒకరకంగానైనా వెలిగి పోదామనుకున్న సింహాచలం!! ❋

# వెదురు



వెదురు ఎప్పుడూ చావదు. గెడ (గడ) ను కొట్టివేసినా అదే మొదలు నుంచి తిరిగి చిగుళ్ళు తొడిగి పెరుగుతుంది. ఫెంగ్ ష్యూ పద్ధతిలో వెదురుకు చాలా ప్రాముఖ్యం ఉన్నది. దీర్ఘాయుర్దాయానికి వెదురు చాలా మంచిది. నష్టపోయిన ధనంగానీ, వ్యాపారం గానీ మనిషిని కృంగదీయకుండా తిరిగి పుంజుకునే ఆత్మస్థైర్యాన్ని వెదురు ప్రసాదిస్తుంది. దీర్ఘాయువు, దీర్ఘకాలిక అదృష్టానికీ వెదురు బాగా ఉపయోగిస్తుందని చెప్పారు.

వెదురును ఇంటిలోను, వ్యాపార స్థలంలోను కూడా వాడవచ్చును.

## శ్రీమతి లిలియన్ టూ చెప్పిన పద్ధతి

6 నుంచి 8 అంగుళములు పొడవు (15 నుంచి 20 ఎం.మీ.) గల బోలుగా ఉన్న రెండు వెదురు ముక్కల్ని తీసుకోండి. మధ్యలో కణుపులు ఉండరాదు. గాలి ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు తేలికగా వెళ్ళాలి. 9 సెం.మీ.లు గానీ, 9 అంగుళాలుగానీ (లేదా 18,27,36,45 సెం.మీ. లేదా అంగుళాలు) పొడవున్న ఎర్ర రంగు రిబ్బను తీసుకుని దానికి చెరో కొసకూ ఈ వెదురు ముక్కల్ని ఊడిపోకుండా గట్టిగా కట్టాలి. (ఏనుగు మెలిక వేస్తే ఊడిపోవు. ఇంటి లోపల వైపు సింహద్వారం పైనగానీ, సింహద్వారానికి ఎదురుగా గోడకుగానీ బొమ్మలో చూపిన విధంగా వెదురు ముక్కలు ఏటవాలుగా ఉండేటట్లు మేకులకు వేలాడదీయాలి (వెదురు కర్రలకు మేకులు కొట్టకూడదు. వాటిని వేలాడదీయాలి). వ్యాపార స్థలంలో వెదురు కర్రలను దుకాణం బయటి వైపు ముఖద్వారం పైన కట్టుకోవాలి. అక్కడ వీలు లేకపోతే లోపల ముఖద్వారం పైన గోడకు వేలాడదీసినా మంచిదే.

## డేవిడ్ డేనియనియల్,ప్రొఫెసర్ లిన్ గార్లు ఇచ్చిన పద్ధతి

శాంతికీ, రక్షణకు, ఆత్మబలానికి వెదురు చాలా మంచిది. వెదురు కొసళ్ళు, కణుపులు ఒకదానికంటే ఇంకోటి పొడవుగా ఉంటాయి. ఇవి ఎదుగుదలకు అదృష్టానికి సూచకాలు. కణుపులను చెక్కి నునుపు చేయరాదు. ఈనెలను అలాగే ఉంచి వాడాలి. జీవితంలో క్రమక్రమంగా కలిగే అభివృద్ధిని సూచిస్తాయి. చిన్న కణుపు ఉన్నవైపు కిందివైపు, ఎక్కువ పొడవున్న కణుపు పైవేపు ఉండేటట్లుగా మేకుకు వేలాడదీయాలి. ఎర్ర రంగు రిబ్బను పొడవు 9,18,27,36,45 అంగుళాలు లేదా సెంటీ మీటర్లు ఉండేటట్లు తీసుకుని వెదురును జారిపోకుండా గట్టిగా కట్టాలి. రిబ్బను కట్టినచోట వెదురుకు రెండు వైపులా ఎర్ర రంగు కుచ్చులను కట్టి 45 డిగ్రీల ఏటవాలుగా ఉండేటట్లు కట్టాలి. అందంగా కూడా ఉంటుంది. దీనిని మీ బెడ్‌రూంలో ఆగ్నేయం వైపుగాని, గుమ్మం నుంచి ఎదురుగా కుడి వైపు మూలకుగాని కడితే మీ వైవాహిక జీవితం సౌఖ్యవంతంగా ఉంటుంది.

– ఎ. పార్థసారథి, రామకృష్ణ